క్లుప్తంగా

ఘనంగా తులాభారం

తల్లాడ: స్థానిక హనుమత్ పద్మావతి సమేత వేంకటేశ్వర ఆలయం వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం శ్రీనివాసమూర్తికి, అమ్మవార్లకు, ఆంజనేయ స్వామికి తులా భారం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడే దివి సీతారామాచార్యుల ఆధ్వర్యంలో అర్చక బృందం, ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాసుడికి మోదకములు, బెల్లం, పటిక బెల్లంతో, శ్రీదేవి, భూదేవి, పద్మావతి దేవి, గోదాదేవి అమ్మవార్లకు పుసుపుకొమ్ములు, కుంకుమతో, ఆంజనేయస్వామి వారికి అరటిపండ్లతోనూ మహా వైభవంగా తులా భార కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

గెస్ట్ లెక్చరర్ నియామకానికి దరఖాస్తులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టును తాత్కాలిక ప్రాతిపదికన నియామకాలు చేపట్టేందుకు గెస్ట్ లెక్చరర్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఇంగ్లీష్ లెక్చరర్ పోస్టుకు ఈ నెల 14న ఇంటర్వ్యూ పద్ధతిలో చేపట్టే నియామకానికి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. 13వ తేదీన సాయంత్రంలోగా బయోడేటాతో కళాశాలకు రావాలని కోరారు.

హమాలీలందరికీ లైసెన్స్ ఇవ్వాలి



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఏన్కూరు: హమాలీలు అందరికీ లైసెన్సులు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మంకెన కృష్ణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రామారావు, వెంకన్న, రమేష్, నాగరాజు, సురేష్ , కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బోరుకు మరమ్మతులు

చింతకాని: మండలంలోని రాఘవాపురం గ్రామంలో తాగునీటి బోరుకు గ్రామ పంచాయతీ సిబ్బంది సోమవారం మరమ్మతులు చేపట్టారు. గ్రామంలోని నాలుగు బోర్లు గత కొంతకాలంగా పనిచేయక గ్రామప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకుని బోరుకు మరమ్మతులు చేయటం జరిగింది. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి జ్యోతి, గ్రామపెద్దలు అబ్బూరి మహేష్, కొల్లి కొండయ్య, మెకానిక్ ఆనంద్, గ్రామ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జలగంను కలిసిన ఏలూరి

మధిర: ఇటీవల బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావుని సోమవారం హైదరాబాద్‌లో మధిర నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. జలగం వెంకట్రావు బీజేపీలో చేరడం వల్ల రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం జిల్లాలో తమ పార్టీ అభ్యర్థి ఘన విజయం సాధిస్తారన్నారు. దేశాభివృద్ధిని కోరుకునే వారంతా బీజేపీలో చేరాలని కోరారు.

బీమా చెక్కు అందజేత

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సభ్యురాలు మేదర కుమారి గత ఆరు నెలల క్రితం పిడుగుపాటుకు గురై మృతి చెందింది. ఈమె పేరిట పార్టీ ఇన్సూరెన్స్ చేయించడంతో మంజూరైన రూ.2లక్షల చెక్కును సోమవారం మృతురాలి భర్త మేదర వెంకయ్యకు పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ యన్నం పిచ్చిరెడ్డిలు అందించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహారావు, అక్కిరెడ్డి, నాగిరెడ్డి, శ్రీనివాసరావు, లక్ష్మణరావు, పుల్లారెడ్డి, శ్రీనివాసరావు, జానీబాషా, బాబురావు తదితరులు ఉన్నారు.

బేటీ బచావో.. బేటీ పడావో


విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

వైరారూరల్: మండలంలోని గన్నవరం హైస్కూల్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ శారద శాంతి మాట్లాడుతూ.. బాలికలు విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలు సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలు, మహిళల హక్కులు, అధికారాల గురించి వివరించారు. అనంతరం విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బీజాన్‌బీ, అంగన్‌వాడీ టీచర్లు పుష్ప, అనిత, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.


కిష్టారం అంబేడ్కర్ కాలనీ వ్యూ


కిష్టారం అంబేద్కర్‌నగర్ సమీపంలోని ఏర్పాటు చేసిన సింగరేణి సైలో బంకర్

మా సమస్య పట్టదా..?

దుమ్ముధూళితో కాలనీవాసులు
- శ్వాసకోశ వ్యాధులతో బెంబేలు
- సింగరేణి తీరుతో అవస్థలు
- కిష్టారం అంబేడ్కర్‌కాలనీ వాసులగోడు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి పరిసర ప్రాంతాల్లో బొగ్గు గనులు వస్తున్నాయి.. మీ భూములకు ధరలు పెరుగుతాయి.. సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తారు.. మీ భవిష్యత్ మారుతుందని ప్రకటనలు ఊదర గొట్టారు.

బొగ్గు గనులు వచ్చాయి..

సింగరేణి అధికారులు అభివృద్ధి పట్టించుకోవటం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కానీ మా ప్రాణాలు హరించేందుకు కాలనీకి దగ్గరలోనే బొగ్గు రవాణా చేసేందుకు సైలో బంకర్ ఏర్పాటు చేశారు.. దీని నుంచి వచ్చే దుమ్మూధూళితో పరిసర ప్రాంతాలు, పచ్చని మొక్కలు, తాగునీటి సంపుల్లో సైతం నల్లని బొగ్గు దుబ్బ వస్తుండటంతో దీనిని పీల్చిన కాలనీవాసులకు శ్వాసకోశ వ్యాధులు ఎక్కువై ప్రాణాల మీదకు వస్తుందని వాపోతున్నారు. ఒకప్పుడు పచ్చని చెట్లతో కళకళలాడాల్సిన కిష్టారం అంబేడ్కర్‌నగర్ కాలనీ వాసులు ఇప్పుడు రోగాలతో మంచం ఎక్కాల్సిన పరిస్థితుల ఏర్పడ్డాయి.

ప్రత్యామ్నాయమే శరణ్యం..

సైలో బంకర్ వల్ల వెలువడే దుమ్మూధూళి వల్ల అంబేడ్కర్‌నగర్ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సింగరేణి అధికారులు సైతం పట్టించుకోకపోవటంతో ప్రత్యామ్నాయం చూపించాలని కోరుతున్నారు. అంబేడ్కర్‌నగర్‌ను సింగరేణి అధికారులు స్వాధీనం చేసుకొని తమకు ప్రత్యామ్నాయ మార్గం చూపించాలని ధర్నాలు చేసినా.. అధికారులకు వినతులు అందజేసినా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదని వాపోతున్నారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ప్రకటించి వేరేచోట ఇళ్ల స్థలాలు చూపించి ఇళ్లు కట్టించి పెట్టాలని సింగరేణి అధికారులను వేడుకుంటున్నారు.


జ్వరం బారిన పడిన మహిళలు

ఇంటికో ఇబ్బంది..

దుమ్మూధూళితో కాలనీలోని ప్రజలు మంచం ఎక్కాల్సి వస్తుంది. శ్వాసకోశ వ్యాధులు, కిడ్నీ, ఒళ్లు, కీళ్ల నొప్పులు, జ్వరాల బారిపడుతున్నారు. ఇప్పటికే కాలనీలో ఇంటికొక్కరు చొప్పున జ్వరంతో బాధపడుతున్నారు.

ప్రత్యామ్నాయం చూపించండి..


సైలో బంకర్ వల్ల వచ్చే దుమ్మూ దూళిని అధికారులు ఎలాగో నివారించలేరు. పొల్యూషన్ అధికారులు వచ్చినప్పుడు బొగ్గు లోడింగ్‌ను నిలిపివేస్తారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ప్రకటించి వేరేచోట ఇళ్ల నిర్మాణం చేపట్టాలి.
– కడారి మదీన, మాజీ సర్పంచ్, కిష్టారం

నా భర్త ప్రాణాలు తీసింది..


నా భర్త పాలకుర్తి రాములు దగ్గు, ఊపిరితిత్తుల వ్యాధితో ఆస్పత్రుల చుట్టూ తిరిగి నెలరోజుల క్రితమే మృతి చెందాడు. బొగ్గు వల్ల వచ్చే దుమ్మూధూళితోనే తమ ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది. దీనిని నివారించేందుకు ఎందుకు ప్రయత్నించరు.
– పాలకుర్తి విజయ, అంబేడ్కర్‌నగర్, కిష్టారం

జ్వరంతో బాధపడుతున్నాం..


మా ఇంట్లో ఇద్దరం జ్వరంతో బాధపడుతున్నాం. ఒళ్లు, కీళ్ల నొప్పులతో నడవలేని పరిస్థితి ఏర్పడింది. ప్రతిరోజు సత్తుపల్లి ఆస్పత్రికి వెళ్లి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. సింగరేణి అధికారులు మాత్రం ఇక్కడ వైద్య శిబిరం నిర్వహించటం లేదు.
– కొక్కెరగడ్డ మణి, అంబేడ్కర్‌నగర్, కిష్టారం

తాగునీటికి ఇబ్బంది రాకుండా చూడాలి


తల్లాడ: మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రమౌళి

తల్లాడ/కల్లూరురూరల్/వేంసూరు: వేసవిలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కల్లూరు మేజర్ గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, వేంసూరు ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. తల్లాడ మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సిందూ, మిషన్ భగీరథ ఏఈ నితిన్ మాట్లాడుతూ.. మండలానికి ఎమ్మెల్యే రాగమయి డీఎమ్ఎఫ్‌టీ నుంచి రూ.కోటి, అదే విధంగా ఎస్‌డీఎఫ్ నుంచి రూ.16లక్షలు నిధులు మంజూరు చేశారని, దీంతో పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. మండలంలో 237 బోర్లను మరమ్మతులు చేసి పని చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వారు వెల్లడించారు. కల్లూరు పంచాయతీ ఆవరణలో నిర్వహించిన గ్రామసభలో పలు రకాల సమస్యలపై చర్చించారు. అనంతరం ఎంపీటీసీ కొండూరు కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. మధిరరోడ్‌లో గతంలో తొలగించిన డంపింగ్ యార్డ్‌లో మళ్లీ చెత్తా చెదారం వేస్తున్నారని దీంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. అధికారులందరికీ సమాచారం పంపినా పలువురు రాకపోవడంతో చర్యలు తీసుకోవాలని సభలో తీర్మానించారు. అదే విధంగా వేంసూరు రైతు వేదికలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో ప్రజలు తాగు నీటికి ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రమౌళి, ఎంపీఓలు శ్రీదేవి, రంజిత్‌కుమార్, ఎంఈఓ దామోదరప్రసాద్, వైద్యాధికారి రత్నమనోహర్, ఏఓ ఎండి.తాజుద్దీన్, ఏఈలు రాజేష్, అశోక్, జయలక్ష్మి, ఏపీఓ కోటయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణారావు, ఎంపీటీసీలు కొండూరు కిరణ్‌కుమార్, మాదిరాజు లక్ష్మణరావు, మండల కోఆప్షన్ సభ్యుడు అలి, మాజీ వార్డు సభ్యుడు అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి


ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

వైరా: పంచాయతీలో పని చేస్తున్న తమను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని పంచాయతీ కార్మికులు కోరారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు. కార్మికులు మాట్లాడుతూ.. ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే విడుదల చేయాలన్నారు. తమ గోడును ఎమ్మెల్యే పట్టించుకుని సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

28న బార్ అసోసియేషన్ ఎన్నికలు

మధిర : మధిర బార్ అసోసియేషన్‌కు ఈ నెల 28న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి చింతల గోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి 20 వరకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, 21న నామినేషన్లు పరిశీలన అనంతరం సాయంత్రం 5 గంటలకు పోటీలో ఉన్న వారి జాబితా ప్రకటించడం జరుగుతుందన్నారు. 22 సాయంత్రం 4 గంటల లోపు నామినేషన్లు ఉపసంహరణ చేసుకునేందుకు అవకాశం ఉంటుందని.. అదే రోజు సాయంత్రం 5 గంటలకు పోటీలో ఉన్న ఫైనల్ జాబితా ప్రకటించడం జరుగుతుందన్నారు. 28న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎన్నికలు నిర్వహించి అనంతరం కౌంటింగ్ చేపట్టనున్నట్లు గోపాల్ తెలిపారు. గెలిచిన వారితో ఏప్రిల్ ఒకటిన ప్రమాణస్వీకారం ఉంటుందని తెలిపారు.

ఇంటింటి సర్వే చేపట్టాలి


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ముదిగొండ: మండలంలోని అన్ని గ్రామాల్లో కుష్టువ్యాధి నివారణకు ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వే నిర్వహించాలని ముదిగొండ పీహెచ్‌సీ వైద్యురాలు అరుణాదేవి అన్నారు. ముదిగొండలో సోమవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సర్వే ప్రారంభించారు. శరీరం మీద మొద్దుబారిన మచ్చలున్న వారిని గుర్తించి వారికి ఉచితంగా మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ దుర్గామల్లేశ్వరి, సూపర్‌వైజర్స్ సరోజిని, లత, ఏఎన్ఎంలు రాణి, మెహరున్నీసా, పద్మావతి,నాగేశ్వరమ్మ, హేమలత, కృష్ణమణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక


పార్టీలో చేరిన వారితో మల్లు నందిని

మధిరరూరల్: మండలంలోని నాగవరప్పాడు గ్రామంలోని పలువురు బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ మేరకు సోమవారం భట్టి క్యాంప్ కార్యాలయంలో అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధిరలో చేపడుతున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కిషోర్, కాంగ్రెస్ నాయకులు వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రంగా హనుమంతరావు, దారా బాలరాజు, పారుపల్లి విజయ్, రంగా శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, వాసు, కృష్ణ, అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.


స్వయం ఉపాధిపై అవగాహన


మాట్లాడుతున్న హెచ్ఎం గురవయ్య

ముదిగొండ: మండలంలోని దివ్యాంగులకు ఎనేబుల్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో స్వయం ఉపాధిపై అవగాహన నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బంకా గురవయ్య ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడుతూ.. దివ్యాంగులు వ్యాపార అభివృద్ధిపై అవగాహన పెంచుకోవడం మంచిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ముదిగొండ మండల వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఇనప ఉపేందర్, ఉపాధ్యక్షుడు గుంజలూరి రాంబాబు, ఎస్ఆర్‌డీఎస్ సంస్థ డైరెక్టర్ గడ్డం రాంబాబు, ఆర్‌టీసీ ప్రతినిధి వహీద్ పాషా, మల్లికార్జున్, ఎనేబుల్ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

'రన్ ఫర్ జీసస్' పోస్టర్లు ఆవిష్కరణ

కల్లూరు: మండలంలోని ఐక్య క్రైస్తవ సమైక్య ఎబిసీసీ, ఎన్‌సీసీ, టీసీసీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న రన్ ఫర్ జీసస్ పోస్టర్లను ఏబీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎనోష్ కుమార్, ఎన్‌సీసీ రాష్ట్ర కార్యదర్శి గుర్రాల సత్యానందం, రాష్ట్ర కోఆర్డినేటర్ గంగవరపు దేవసహాయం, మండల అధ్యక్షుడు తేళ్ల ఎబినేజర్లు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రైస్తవులు ఐక్యతగా ఉండి మన ఉనికి కాపాడుకోవాన్నారు. మార్చి 30న రన్ ఫర్ జీసస్ కార్యక్రమానికి రెండు తెలుగు రాష్ట్రాల్లోని క్రైస్తవులు ఒకే వేదికపైకి వస్తున్నారన్నారు. ఎన్నెస్పీ క్రాస్ రోడ్డు నుంచి కొత్త బస్టాండ్ వరకు కార్యక్రమం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో టి.నిర్మల్ కుమార్, దర్నాసి బాలరాజు, దాసరి డేవిడ్, సంజీవరావు, పేరుమాళ్ల దయాకర్, జాన్‌పరంజ్యోతి, గొడిపేర జీవన్ కుమార్, ఆదూరి రాజశేఖర్, జీవ దాసన్న పేతురు సేవకులు పాల్గొన్నారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

బొగ్గు లోడింగ్ ఇవ్వాలి

సత్తుపల్లిరూరల్: సింగరేణిలో భూములు కోల్పోయి బతుకుదెరువు కోసం లారీలను కిరాయికి తిప్పుతున్న వారికి సింగరేణి యాజమాన్యం సరిగా బొగ్గు లోడింగ్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తుందని లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు కొండపల్లి రమేష్‌రెడ్డి అన్నారు. దీంతో సోమవారం కిష్టారం ఓసీలో లారీ యజమానులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. సుమారు 800 లారీలతో బొగ్గు లోడింగ్ ఆధారంగానే జీవనం కొనసాగిస్తున్నామని, లోడింగ్ లేకపోవటంతో ఫైనాన్స్‌లో తీసుకున్న లారీలకు ఈఎంఐలు చెల్లించలేక, డ్రైవర్లు, క్లీనర్లకు జీతాలు ఇవ్వలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. రోజుకు 30 నుంచి 40 లారీలకు మాత్రమే బొగ్గు లోడింగ్ ఇవ్వటంతో నెలలో రెండు ట్రిప్పులకు కూడా తిప్పలేక పోతున్నామన్నారు. ఆందోళన చేస్తున్న లారీ యజమానుల వద్దకు సింగరేణి కిష్టారం పీఓ నర్సింహారావు, క్వాలిటీ కంట్రోల్ అధికారి మధుమోహన్‌లు చేరుకొని వారితో చర్చించారు. లారీ యజమానుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో లియాకత్, కీజర్, విజయ్, రవి, చక్రి, రవి వర్మ, కలీల్ రెహ్మాన్ పాల్గొన్నారు.


కిష్టారం ఓసీ వద్ద ఆందోళన చేస్తున్న టిప్పర్, లారీల యజమానులు

ఎలక్ట్రోరల్ బాండ్ల వివరాలు అందించాలి


సత్తుపల్లిటౌన్: ఎస్‌బీఐ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు



పెనుబల్లి: ఎస్‌బీఐ ఎదుట..

కల్లూరు/ తల్లాడ/ సత్తుపల్లిటౌన్/ పెనుబల్లి/ వేంసూరు: ఎలక్ట్రోరల్ (ఎన్నికల) బాండ్ల వివరాలను అందించాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిర్లక్ష్యం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శులు మాదాల వెంకటేశ్వరరావు, ఐనాల రామలింగేశ్వరరావు, దొండపాడు నాగేశ్వరరావు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పాండురంగారావు, శ్రీనివాసరావు, చలమాల విఠల్‌రావు తెలిపారు. కానీ బీజేపీ ఒత్తిడితో ఇప్పటి వరకు బాండ్ల వివరాలు సుప్రీంకోర్టుకు సమర్పించకపోవడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ఎస్‌బీఐ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్‌బీఐ ప్రజల బ్యాంక్‌గా కాకుండా బీజేపీ బ్యాంక్‌గా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను సైతం ఎస్‌బీఐ బేకాతరు చేయడం క్షమించరాని నేరమన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు తన్నీరు కృష్ణార్జునరావు, ముదిగొండ అంజయ్య, బట్టు నరసింహారావు, సామినేని హనుమయ్య, దోమతోటి పుల్లయ్య, తన్నీరు కృష్ణవేణి, సామినేని రాము, మోదుగు వెంకయ్య, రావి వెంకట సత్యం, సీపీఎం నాయకులు శీలం సత్యనారాయణరెడ్డి, నల్ల మోతు మోహన్‌రావు, అనుమోలు కృష్ణయ్య, యాస వెంకయ్య, గరిడేపల్లి రామక్రిష్ణ, కోటగిరి నవీన్, సీపీఎం సత్తుపల్లి పట్టణ కార్యదర్శి రావుల రాజబాబు, కొలికపోగు సర్వేశ్వరరావు, బడేమియా, రమేష్, రవి, నందు, వలీ, వెంకటేశ్వరరావు, సైదా, జానీ, సీపీఎం మండల కార్యదర్శి తిరుపతిరావు, నాయకులు నరసింహారావు, ప్రతాప్, చిరంజీవి, రాజేశ్వరరావు, కంటే సత్యం, కొప్పుల వెంకటేశ్వరరావు, సీహెచ్ సీతారాములు, బోయినపల్లి వీరబాబు, కిలారి సురేష్, నిమ్మ తోట ఖాన, బిల్లా విశ్వనాథం, మల్లికార్జున్‌రావు, ఏసుపోగు బాబు, మాదినేని నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

పన్నుల భారం తగ్గించాలి

వైరా: వైరా మున్సిపాలిటీలో ఇంటి పన్నుల భారాన్ని తగ్గించాలని బీఆర్ఎస్, సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అంతకు ముందు ఇరుపార్టీల కార్యకర్తలు వైరా రింగ్ రోడ్డు నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మాజీ దిశ కమిటీ సభ్యుడు కట్టా కృష్ణార్జునరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొంతు రాంబాబులు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పాలక వర్గాలతో ఎటువంటి చర్చలు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇంటి పన్నుల నిర్ణయించి ఇబ్బడి ముబ్బడిగా పెంచిందన్నారు. ఇంటి పన్నులు తగ్గించే వరకు ఆందోళన విరమించేది లేదన్నారు. వైరా మున్సిపాలిటీలో దాదాపు రెండేళ్ల క్రితం ప్రారంభించిన వీధి దుకాణదారుల సముదాయ భవన నిర్మాణం పూర్తి చేయడం లేదన్నారు. మధ్యలో నిలిచి పోయిన సీసీరోడ్లు, సైడ్ డ్రెయిన్లు నిర్మాణం తిరిగి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ చింతల వేణు ఆందోళన కారులతో మాట్లాడి ఇంటి పన్నులు తిరిగి రివైజ్ చేసి ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు వనమా విశ్వేశ్వరరావు, పవిత్రకుమారి, నాగేశ్వరరావు, సురేష్, బీఆర్ఎస్ నాయకులు మద్దెల రవి, మాదినేని ప్రసాద్, సీపీఎం నాయకులు సుధాకర్, నాగేశ్వరరావు, మణి, చలపతిరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


వైరా మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్, సీపీఎం నాయకులు

అలరించిన నాటకం


నాటకం ప్రదర్శిస్తున్న కళాకారులు

మధిర: మహాశివరాత్రి సందర్భంగా పట్టణంలో శివాలయం వద్ద జరుగుతున్న జాతరలో ఆదివారం రాత్రి మాటూరుపేట శ్రీ సీతారామాంజనేయ కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రామాంజనేయ యుద్ధం నాటకం ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకుంది. ముఖ్యంగా నాటకంలోని యుద్ధ శీను ఘట్టం, శ్రీకృష్ణ రాయబారం నాటకం నుంచి పడక శీను ఘట్టాన్ని కళాకారులు తన నటన ద్వారా రక్తి కట్టించారు. అనంతరం మాటూరుపేట శ్రీ సీతారామాంజనేయ కళాపరిషత్ వ్యవస్థాపకుడు గడ్డం సుబ్బారావు ఆధ్వర్యంలో మల్లు నందిని, మల్లు సూర్యవిక్రమాదిత్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్సై సంధ్య, ఆలయ నిర్వహణ అధికారి జగన్మోహన్ రావు, రంగస్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు పుతుంబాక శ్రీకృష్ణ ప్రసాద్, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల సమావేశం

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలు సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సాకేత్‌రెడ్డి మాట్లాడుతూ.. వేసవికాలం ప్రారంభమైనందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉదయం, సాయంత్రం వేళలో మాత్రమే బయటకు వెళ్లాలన్నారు. ఆరోగ్య ఉప కేంద్రాల్లో, వైద్యసిబ్బంది దగ్గర ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యుడు వెంకట్ లాల్, సిబ్బంది కాంతమ్మ, సదాశివరావు, రాణి, సూపర్‌వైజర్లు, వెంకటేశ్వరరావు, సాయిరెడ్డి, అశోక్, వెంకటేశ్వరరెడ్డి, సుధాకర్ తదితరులు ఉన్నారు.

బీటెక్ ఫలితాల్లో ప్రతిభ

సత్తుపల్లిరూరల్: 2023–24 విద్యాసంవత్సరంలో బీటెక్ ఫస్టియర్ మొదటి సెమిస్టర్ చదివిన విద్యార్థులకు జనవరిలో జేఎన్‌టీయూ హైద్రాబాద్ వారు నిర్వహించిన పరీక్షా ఫలితాల్లో మదర్‌థెరిస్సా కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ తెలిపారు. దీంతో ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటుగా సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాంబశివరావు, చైర్మన్ సత్యనారాయణ, ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్ హుస్సేన్, బేసిక్ విభాగం అధిపతి పి.మారేశ్వరరావు తదితరులు అభినందించారు.

అనంతారంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

కొణిజర్ల: మండలంలోని అనంతారంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. గ్రామానికి చెందిన ప్రొఫెసర్ వినుకొండ తిరుమల్ రిబ్బన్ కట్ చేయగా, మాల మహానాడు రాష్ట్రనాయకుడు గుద్దేటి వీరభద్రం, హైకోర్టు న్యాయవాది పల్లా రాజశేఖర్, అంబేడ్కర్ ప్రజా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లింగాల రవికుమార్, స్థానిక పెద్దలు నెల్లూరి కోటేశ్వరరావుల చేతుల మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో ప్రకాశం, వెంకటేశ్వర్లు, జైపాల్, శ్రీను, యాలాద్రి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి నివాళి

కొణిజర్ల: ఇటీవల మృతి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు వెలనాటి వెంకటప్పయ్య మృతికి సోమవారం పలు పార్టీల నాయకులు నివాళులు అర్పించారు. మండలంలోని పెద్దగోపతిలో సోమవారం వెంకటప్పయ్య సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ వాసిరెడ్డి రామనాథం, మండల అధ్యక్షుడు సుధాకర్‌రావు, వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్, మాజీ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కోటేశ్వరరావు, సీపీఐ నాయకులు హేమంతరావు, ప్రసాద్, రాంబాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.